PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :134 | పేజీలు : 8 | వెల రూ.5 | బుధవారం. 27.05.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## సింగరేణిపై కాంగ్రెస్ అక్రమాలు మరిన్ని బయటపెడతా: హరీష్ రావు

హైదరాబాద్, మే 26 ప్రభాత సూర్యుడుశంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో – సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు.



## అక్కడ నిర్లక్ష్యం చేస్తూ ఇక్కడ యాత్రలు చేయడం ఏమిటి..?: ఉత్తమ్

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు ధాన్యం కొనుగోళ్ల విషయంలో గత బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఎంత ధాన్యం కొనుగోలు చేశారో చెక్ చేసుకోని మాపై విమర్శలు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యాసంగి పంట కంటే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేసి నిధులు ఇచ్చామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన మంత్రి.. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నిర్వర్తించడం లేదని విమర్శించారు. కేంద్రం చెప్పిన మీరా ధర పెట్టి ధాన్యం తీసుకోవాలి. కేంద్రం నిర్లక్ష్యంగా ఉండి.. ఇక్కడ యాత్రలు చేయడం ఏమిటి? అని బీజేపీని ప్రశ్నించారు.



**ఏ రాష్ట్రంలో ఎంత కొన్నారో చెప్పండి:**

బీజేపీ పాలిత అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యం తెలంగాణ కొనుగోలు చేస్తోందని, మేము 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటున్నామన్నారు. ఈ ధాన్యం మొత్తం కేంద్రం కొనాల్సి ఉందన్నారు. 8,575 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రాష్ట్రంలో చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. నిన్నటి వరకు 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత ధాన్యం కొన్నదో బీజేపీ నాయకులు చెప్పాలన్నారు. గత ఏడాది, ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంకంటే 5వేల కోట్లు ఎక్కువ ఖర్చు చేశామన్నారు.

# భూ సేకరణ ఆపెయ్యాలి

### ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు సేకరిస్తున్నారు
### రద్దు చేయాలని గవర్నర్‌కు విన్నవించిన కవిత

కడ్లాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూ సేకరణకు విడుదల చేసిన నోటీసును రద్దు చేయాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత కోరారు. నిబంధనలకు విరుద్ధంగా విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని విన్నవించారు. వెలుగుమట్ల, ట్రిపుల్ ఆర్, పరిగి బాధితులతో పాటు విశారదన్ మహారాజ్ తో కలసి మంగళవారం హైదరాబాద్ లోక్‌భవన్ లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కవిత భేటీ అయ్యారు.. ఈ సందర్భంగా కండ్లాపూర్ గ్రామం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్నప్రాంతం అని వివరించారు. ఆ ప్రాంతం నల్లరేగడి భూముల్లో స్థానిక వందలాది మంది రైతు కుటుంబాలు వాణిజ్య పంటలు, కూరగాయలు, పండ్లు, వరి తదితర పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాయి అని గవర్నర్ కు వివరించారు.

హైదరాబాద్,ప్రభాత సూర్యుడు



#### పేదల ఉపాధి పోతుందని..

వ్యవసాయానికి తోడు పాడి, మాంసం ఆధారిత ఉత్పత్తులతో రైతు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని టీఆర్ఎస్ అధినేత కవిత వెల్లడించారు. రైతులతోపాటు వ్యవసాయ కూలీలు, మార్కెట్ ఆధారిత వ్యవస్థల్లో పనిచేసే వారు, రవాణా వాహనాల వారు పరోక్షంగా ఉపాధిపొందుతున్నారు అని చెప్పుకొచ్చారు. కడ్లాపూర్ గ్రామంలోని 159 ఎకరాల 25 గుంటల భూమిని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించేందుకు టీజీఐఐసీ( తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) 2026 మార్చి 16న గెజిట్ ను జారీ చేసింది. గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన రైతుల భూముల్లో కాకుండా ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అత్యంత పేద రైతుల భూములనే ఇండస్ట్రియల్ పార్క్ కోసం సేకరిస్తామని గెజిట్‌లో ప్రకటించారు. ఫలితంగా గ్రామంలోని పేద రైతులతో పాటు మిగిలిన పేద కుటుంబాలకు ఉపాధి దొరకకుండా పోతుంది అని టీఆర్ఎస్ అధినేత కవిత వివరించారు

## మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి సీతక్క



హైదరాబాద్, ప్రభాత సూర్యుడుమహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు.

# ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం కష్టం..

### లొంగిపోయిన మావోయిస్టు నరహరి

హైదరాబాద్, మే 26 ప్రభాత సూర్యుడుప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు చేపట్టిన సాయుధ పోరాటం కష్టంగా మారిందని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు పసునూరి నరహరి వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ మావోయిస్టులు నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా లొంగిపోయిన నరహరి మీడియాతో మాట్లాడుతూ.. జార్ఖండ్, తెలంగాణతో పాటు మిగతా ప్రాంతాల్లో సాయుధ పోరాటం పరంగా అనేక నష్టాలు చేశామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కల్పించిన అవకాశాలు కారణంగానే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని స్పష్టం చేశారు. జార్ఖండ్‌లోని మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మిసిరి బిశ్రా అనుమతితోనే తాము ప్రజా జీవితంలోకి వచ్చామని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల సాధన చట్టపరంగానే జరగాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు, సాయుధ పోరాటంలో చోటు చేసుకున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజా జీవితంలోకి రావాలని మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావును నరహరి కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డితోపాటు డీజీపీ సీవీ ఆనంద్‌కు పసునూరి నరహరి కృతజ్ఞతలు తెలిపారు. మే 12వ తేదీన తెలంగాణ పోలీసులు ఎదుట మావోయిస్టులు నరహరితోపాటు ధనమ్మ లొంగిపోయారు. వీరిని మంగళవారం మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వం తరఫున వారికి డీజీపీ నగదు చెక్కులను అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న 47 మంది మావోయిస్టులు కూడా లొంగి పోవాలని ఈ సందర్భంగా డీజీపీ పిలుపునిచ్చారు.






# టీవర్క్స్ విజన్.. సాంకేతిక శక్తికి వేదిక

### కేసీఆర్ ఆలోచనలో పుట్టిన టెక్ స్టార్టప్

హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చిన టీవర్క్స్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు టీవర్క్స్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనల్లో పుట్టి, యువత చేతుల్లో సాంకేతిక శక్తిగా మారిన గొప్ప వేదిక ఇది అని ఆయన కొనియాడారు. ఈ మేరకు ఆయన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. స్టార్టప్‌లకు కేవలం మాటల ప్రోత్సాహం కాదు.. ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని తెలిపారు. ఈనాడు దేశం మొత్తం డ్రోన్లు, డిఫెన్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గురించి మాట్లాడుతున్నప్పుడు.. తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే నాటింది కేసీఆర్ నాయకత్వం అని పేర్కొన్నారు. టీవర్క్స్ అనేది ఒక భవనం కాదని.. తెలంగాణ యువత కలలకు రెక్కలు తొడిగి ప్రయోగశాల అని కేటీఆర్ తెలిపారు. మేక్ ఇన్ తెలంగాణ అనే ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్‌ను తీసుకొచ్చి, హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టిన దూరదృష్టి కేసీఆర్‌దే అని చెప్పారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న ఈ సంస్థ.. తెలంగాణ అభివృద్ధి ఎంత ముందుచూపుతో సాగిందో మరోసారి నిరూపిస్తోంది అని పేర్కొన్నారు.

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు:

ప్రభాత సూర్యుడు



# కోహెడలో సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**– జూన్ 3న కోహెడ వ్యవసాయ మార్కెట్‌కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన**
**– రైతులకు న్యాయం చేస్తాం : కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**
**– తెలంగాణకు మణిహారంలా కోహెడ మార్కెట్ : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**





రంగారెడ్డి -- ప్రభాత సూర్యుడు జూన్ 3వ తేదీన కోహెడలో జరిగే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతితో కలిసి కోహెడలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిబట్ల సర్కిల్ తొర్రూర్ డివిజన్ పరిధిలోని కోహెడ రెవెన్యూ సర్వే నంబర్ 167/1లో ప్రభుత్వం 239 ఎకరాలను కేటాయించిన నేపథ్యంలో కోహెడ వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. భూముల్లో సాగు చేస్తున్న రైతులను గుర్తించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా 239 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. తెలంగాణకు మణిహారంలా కోహెడ మార్కెట్ నిలుస్తుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు

# పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**– మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపిన బీసీ సంఘాల నాయకులు**

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు తెలంగాణ పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన జన్మదిన సందర్భంగా పలువురు బీసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ మహిళా జేఏసీ అధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్, రాజకీయన్ దినపత్రిక ఎడిటర్ వీరమల్ల లింగయ్య గౌడ్, తెలంగాణ బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర శ్రీహరి గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలగొని శ్రావణ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి పల్లె సైదులు గౌడ్ తదితరులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు..



# కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రభాత సూర్యుడు మే 26 నాయుడుపేట సూళ్లూరుపేట డివిజన్ ఇంచార్జ్ తిరుపతి జిల్లా నాయుడుపేట లోని తుమ్మూరు గ్రామంలోని వెలసి ఉన్న శ్రీ శ్రీ కరిమాణిక్య స్వామి వారి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో రేపటి నుండి జరుగుతుందని సన్నారెడ్డి బాలసుబ్రమణ్యం రెడ్డి తెలియజేశారు. 27 తేదీ నుండి మొదలై జూన్ 6వ తేదీ వరకు శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు వేలాదిగా వచ్చే భక్తులతో కనులవిందుగా ఉంటుందని అన్నారు. అనంతరం చివరి రోజున శ్రీ స్వామి వారు తుమ్మూరు లోని మాడవీధులలో రథోత్సవం కార్యక్రమం ఉంటుందని కావున భక్తులెల్లరు అశేషంగా జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించి శ్రీ స్వామివారి అమ్మవార్ల కృపా కటాక్షములు పొందాలని తెలియజేశారు. ఈ మహత్తర బ్రహ్మోత్సవ కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో వేద పండితులచే శాస్త్రోత్వంగా జరుగుతుందని సన్నారెడ్డి బాలసుబ్రమణ్యం రెడ్డి తెలిపారు. ఈ యొక్క బ్రహ్మోత్సవ కార్యక్రమాలకి ప్రతి ఒక్కరు కూడా విచ్చేసి కనులు విందుగా జరిగే కార్యక్రమాలను తిలకించి ఆ దేవదేవుని ఆశీస్సులు పొందాలని సన్నారెడ్డి బాలసుబ్రమణ్యం రెడ్డి కోరారు.

# ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట్ ఎమ్మార్వో

**– డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబాటు**
**– 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు రూ.30 లక్షల డీల్ ఆరోపణలు**



శామీర్‌పేట్ -- ప్రభాత సూర్యుడు శామీర్‌పేట్ ఎమ్మార్వో సుచరిత అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. 30 ఎకరాల భూమికి నాలా కన్వర్షన్ చేయించేందుకు ఒక్క ఎకరానికి లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా అడ్వాన్స్‌గా రూ.2 లక్షలను తన డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనతో రెవెన్యూ శాఖలో కలకలం రేగింది. ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న భూ వ్యవహారాలు, అనుమతులు, కీలక పత్రాలు, ఫైళ్లపై ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై కూడా లోతుగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బొమ్మరాస్పేట్ ప్రాంతంలో ఉన్నతాధికారులతో కలిసి పెద్ద ఎత్తున భూముల క్లియరెన్స్ వ్యవహారాల్లో కూడా సుచరిత పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.



# మీ సురక్ష"పై నాగోల్ పోలీసుల అవగాహన

**– బండ్లగూడ ఇందు ఆరణ్య అపార్ట్‌మెంట్స్‌లో ప్రత్యేక కార్యక్రమం**
**– ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎల్‌బీ నగర్ ఏసీపీ కృష్ణయ్య**

నాగోల్ -- ప్రభాత సూర్యుడునాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో ఉన్న ఇందు ఆరణ్య అపార్ట్‌మెంట్స్‌లో "మీ సురక్ష" కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీ నగర్ ఏసీపీ శ్రీ కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని అపార్ట్‌మెంట్ నివాసితులను ఉద్దేశించి మాట్లాడారు.




ఈ సందర్భంగా "మీ సురక్ష" కార్యక్రమం ప్రాముఖ్యత, నమోదు, ధృవీకరణ విధానం, అత్యవసర సేవలు, మహిళలు మరియు పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ, పోలీస్ సహాయక సేవలు, హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై వివరించారు. ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి తమ ప్రాంత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి. శివనాగ ప్రసాద్, పి. దశరథ్, బీసీ–2 సిబ్బంది మరియు అపార్ట్‌మెంట్ నివాసితులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై వైసీపీ విషప్రచారం.. లోకేష్ కు మంచి పేరొస్తుందని బురద జల్లుతూ ఫేక్ పార్టీ కుట్రలు

విజయవాడ ప్రభాత సూర్యుడుగొల్లపూడిలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టిడిపి నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వైసీపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "నా తెలుగుదేశం – – నా బాధ్యత" నినాదంతో తెలుగువారి పండుగ మహానాడును ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా కార్యకర్తలు మహానాడును విజయవంతం చేయడానికి ఉత్సాహంగా సిద్ధమవుతున్నారని చెప్పారు. గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించడంతో పాటు, రాబోయే మూడు సంవత్సరాలకు దిశానిర్దేశం చేసే వేదికగా ఈ మహానాడు నిలవనుందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ--2025ను పారదర్శకంగా నిర్వహిస్తుంటే వైసీపీ సోషల్ మీడియాలో ఫేక్ ట్వీట్లు, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని దేవినేని ఉమ మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్ కు వస్తున్న ప్రజాదరణను చూసి వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. నిరుద్యోగులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా ఇప్పుడు టీచర్లను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

# శ్రీకాళహస్తి లో పండుగ వాతావరణంలో మహానాడు

## కోట చంద్రశేఖర్



శ్రీకాళహస్తి. ప్రభాత సూర్యుడు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు-2026 ఈనెల 27,28 తేదీల్లో పండుగ వాతావరణంలో జరగనుంది. 'స్త్రీ శక్తి' థీమ్‌తో ఈసారి మహానాడును రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ వేదికల ద్వారా హైబ్రిడ్ వద్ధతిలో నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలుగుజాతి ప్రగతి, తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం ఏర్పడిన తెలుగుదేశం పార్టీకి మహానాడు బలం, త్యాగం, క్రమశిక్షణ, సంస్థాగత స్ఫూర్తికి ప్రతిబింబమని నేతలు పేర్కొన్నారు. ఏడాదికోసారి అంగరంగ వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో జరిగే మహానాడుకు పసుపు సైన్యం సిద్ధమైందని తెలిపారు. మహిళలను పెద్దఎత్తున ప్రోత్సహించడమే లక్ష్యంగా 2026 మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి మహానాడును 1875 క్లస్టర్ల వేదికగా నిర్వహించడం విశేషం. ఈ మహానాడులో ప్రతీ ఒక్క కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని తిరుపతి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ కోరారు.

# నేడు రేపు మినీ మహానాడు...

శ్రీకాళహస్తి, ప్రభాత సూర్యుడు . తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో శ్రీకాళహస్తిలో మినీ మహానాడు కార్యక్రమం జరగనుంది. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పార్టీ ముఖ్య నాయకులతో చర్చలు జరిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఉదయం ఎన్టీ రామారావు విగ్రహానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వర్చువల్ గా జరిగే మహానాడు కార్యక్రమానికి పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై వెంటనే ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కూడదని, ప్రజలను కార్యాలయాలకు తిప్పుకోవడం మంచిది కాదని సూచించారు...





# ఏనుగుల బారీ నుండి పంటలతోపాటు.రైతులకు పూర్తి రక్షణ కల్పించాలని జిల్లా రైతు నాయకులు ఉమాపతి నాయుడు ప్రభుత్వాన్ని కోరారు



ప్రభాత సూర్యుడు,. చిత్తూరు జిల్లాలో చాలా మంది వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్న సందర్భంలో అటవి సమీపాన గల అనేక ప్రాంతాల్లో ఏళ్ళ తరబడి ఏనుగుల దాడుల వలన పంట నష్టాలతో పాటు ప్రాణనష్టాలు ఇప్పటికీ ఎక్కువ జరుగుతునే ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం పంట నష్టాలకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారం మాత్రం కొండంత నష్టానికి గోరంత పరిహారం. ఈ పరిహారం ఎక్కడికి సరిపోదని అన్నారు. ప్రస్తుతం రైతులు పంట పెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేసి వేసిన పంటపై ఒకవైపు గుంపులో వారీగా ఏనుగులు. మరోవైపు అడవి పందులు. వీటికి తోడు వేలల్లో కోతుల బెడదలతో రైతులు సతమతమౌతున్నారని తెలిపారు. ఈ ఏనుగులు పంటలను నష్టపరచడమే కాకుండా పొలాల వద్ద నివాసముంటున్న ఇళ్ళపై పశువుల షెడ్లను పట్టు పురుగుల షెడ్లను ధ్వంసం చేయడమే కాకుండా గ్రామాలపై కూడా చొరబడి మూగజీవాలను సైతం లెక్కచేయక చంపేస్తున్నాయని అన్నారు. వీటిని తరిమెందుకు ప్రయత్నిస్తున్న అటవి శాఖ అధికారులను ట్రాకర్స్ లను రైతులపై కూడా అతి క్రూరంగా తిరగబడి ఇప్పటికీ ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నాయని మరికొందరు బలమైన గాయాలతో ఆసుపత్రులలో చేరి ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఇలాంట సంఘటనలు ఏళ్ళ తరబడి జరుగుతున్నా కూడా ప్రభుత్వాలు గాని ప్రజా పాలకులు గానీ వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వలన ఇలాంటి సంఘటనలు ఇప్పటికీ జరుగుతున్నాయని తెలిపారు. ఒకవైపు ఏనుగులవల మరోవైపు వైపు అడవి పందుల కోతులు వీటి వలన పంటనష్టాలతోపాటు ప్రాణనష్టాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని వీటి పోరుకు బయపడి కొన్ని ప్రాంతాల్లో ఈ వ్యవసాయమే మాకు వద్దని బీడు భూములుగా వదిలేస్తున్నారని చెప్పారు. ఏనుగులు పంటపొలాలపై రాకుండా వాటిపై దృష్టి పెట్టి శాశ్వత రక్షణ చర్యల తీసుకుని అటవి సమీపాన గల ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఉంటే ఇలాంటి నష్టాలు జరిగేవీ కాదని ఆయన అన్నారు. ఎలాంటి ఫెన్సింగ్ వంటివి చేయకుండా. కుంకి ఏనుగుల ప్రాజెక్ట కొరకు కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. దీనివలన రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలు. రైతులు వాపోతున్నారని తెలిపారు. ఏనుగుల వలన జరిగే పంటా ప్రాణ నష్టాలకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారం అంతంత మాత్రమే. లక్షల్లో పంటలు నష్టపోతే పంట నష్టానికి తగిన పరిహారం మాత్రం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారని. ప్రస్తుతం ఇస్తున్న పరిహారం ఎక్కడికి సరిపోదని. మేము ఇస్తున్నామని ఏదో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున పరిహారాన్ని మూడింతలు పెంచి ఇస్తే కూడా పంట పెట్టుబడి ఖర్చులకు కూడా ఎక్కడికి సరిపోదు. ప్రస్తుత పంటపెట్టుబడులు. కూలీలు బారీగా పెరిగాయి వీటికి అనుగుణంగా ప్రస్తుత పంటలవారీగా మార్కెట్ రేటు ప్రకారం పంట నష్టమైన రైతులకు పంట నష్టపరిహారం మూడింతలపైన పెంచి ఇస్తే పెట్టిన పెట్టు బడులకైనా వస్తుందని రైతులు భావిస్తున్నారని చెప్పారు. పంట నష్టాలకు ప్రభుత్వం ఇస్తున్న లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టే డబ్బులను అటవి సమీపాన గల ప్రాంతాల్లో వ్యవసాయ భూములకు ఇద్దరు ముగ్గరు కలిసి తమ పొలాలకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు కొరకు అటవీశాఖ అధికారుల ఆమోదంతో వంద శాతం పూర్తి సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తే పంటపొలాలపై ఏనుగులతో పాటు అడవి పందులు కూడా కొంత వరకు నివారించవచ్చునని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుంకి ఏనుగులకు మేత వాటి సంరక్షణ కొరకు మావటీలు వెటర్నరీ డాక్టర్లకు ప్రతి నెలా లక్షలాది రూపాయలు ఖర్చు పెడుతున్నారు. కానీ కుంకి ఏనుగులు ఉండి కూడా ఎలాంటి ప్రయోజనం లేదని అడవి ఏనుగులు ప్రతి నిత్యం వస్తూనే ఉన్నాయని అన్నారు. ఈ కుంకీ ఏనుగులు పూర్తి స్థాయిలో అరికట్టలేక పోతున్నాయని అన్నారు. ఏనుగల ప్రాజెక్టుకు పెడుతున్న కోట్లాది రూపాయలు ప్రజాధనం వృధాతహా అన్నట్టు ఉందని దీనివలన రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు అంటున్నారని తెలిపారు.

# బడా భూస్వామి కోరల్లో 'అంకమ్మ పెద్ద చెరువు'!

## మహాచెరువుకు మరణశాసనం!

## చేపలు చెరువులతో కలుషితమవుతున్న జలాలు!





అశ్వారావుపేట , మే 26 ప్రభాత సూర్యుడు అశ్వారావుపేట సమీపంలోని చారిత్రాత్మక అంకమ్మ పెద్ద చెరువు (సర్వే నెంబర్: 249, విస్తీర్ణం: 239/13 ఎకరాలు) కొందరు అధికార, బడా భూస్వాముల , ఆక్రమణల వల్ల తన ఉనికిని కోల్పోతోంది. ఒకప్పుడు అశ్వారావుపేట ప్రాంతానికి త్రాగునీరు అందించిన ఈ జలాశయం, నేడు భూబకాసురుల చేతుల్లో చిక్కి విలవిల్లాడుతోంది. సుమారు 1000 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ చెరువుకు ప్రధాన కాలవ (మెయిన్ కెనాల్), కుడి కాలవ (రైట్ కెనాల్) అనే రెండు ప్రధాన నీటి వనరులు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న చెరువును కొందరు బడా భూస్వాములు అమాంతం మింగేస్తున్నా.. రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూస్వాములు అవలంబిస్తున్న అక్రమ పద్ధతులు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. అసైన్మెంట్ భూములపై భూ బకాసురుడు, భూమి పై కన్ను పడితే చాలు చేతుల్లోకి వెళ్ళటం ఖాయం, చెరువు పరివాహక ప్రాంతంలోని పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను బడా భూస్వాములు మాయమాటలతో తక్కువ ధరకే కొనుగోలు చేస్తాడు, లేదా 99 సంవత్సరాలు లీజుకు రాసుకొని ఆ భూమిని తన ఖాతాలు చేసుకుంటాడు, తరువాత ఆ భూమిని చదును చేయుటకు చెరువు శిఖం భూముల్లోకి అక్రమంగా మట్టిని తోలి, చెరువు విస్తీర్ణాన్ని కుదించేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఆ భూముల్లో బోర్లు వేసి, కొన్ని సంవత్సరాల పాటు తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.ఆ తర్వాత ఇదే చెరువు భూములను ఎకరాల చొప్పున సుమారు 10 లక్షల రూపాయలకు వేరే వాళ్లకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విధంగా సదరు భూస్వామి వందల ఎకరాలకు తన సామ్రాజ్యాన్ని విస్తరించుకోవడం గమనార్హం.సదరు భూస్వామి చెరువు భూములను ఆక్రమించడమే కాకుండా, అక్కడ భారీ ఎత్తున వాణిజ్య చేపల చెరువులను నిర్మించుకుంటాడు.ఆ చేపల చెరువుల నుంచి వెలువడే ప్రమాదకరమైన రసాయన వ్యర్థాలు, కలుషిత నీటిని నేరుగా ఈ అంకమ్మ పెద్ద చెరువులోకి వదులుతున్నారు.దీనివల్ల చెరువు నీరంతా విషతుల్యంగా మారుతోంది. ప్రభుత్వం నుంచి రాయితీపై లబ్ధి పొంది, ఈ చెరువులో చేప పిల్లలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న సుమారు 50 మంది మత్స్యకార కుటుంబాల ఉపాధి దెబ్బతింటోంది. రసాయనాల వల్ల చేపలు చనిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మెమోరానిచ్చిన కూడా పట్టించుకోలేదు.ఆయకట్టు రైతుల చెరువుకి మెయిన్, రైట్ కెనాల్స్ ద్వారా వరి పంటలు పండించే వందలాది మంది ఆయకట్టు రైతులు చెరువు ఆక్రమణల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం, కాలవలు పూడిపోవడంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపరిచింది. ఈ చెరువు పరిధిలోని కుడి కాలవ (రైట్ కెనాల్) పూర్తిగా పూడికతో నిండిపోయింది.ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో కాలవ సామర్థ్యం దెబ్బతింది.ఫలితంగా, కాలవ చివరి భాగంలో (టెయిల్ ఎండ్) ఉన్న భూములకు చుక్క నీరు కూడా అందడం లేదు."కాలవ నీటిని నమ్ముకుంటే ఇంతే సంగతులు" అని ఆవేదన వ్యక్తం చేస్తూ, విధిలేని పరిస్థితుల్లో కొందరు రైతులు భారీ ఖర్చుతో బోర్లు వేయించుకుని వ్యవసాయం చేస్తున్నారు.బోర్ల ద్వారా నీటి ఖర్చు పెరిగిపోతుండటంతో పెట్టుబడి భారం ఎక్కువై రైతులు అప్పులపాలవుతున్నారు. ఈ అక్రమాలపై బాధితులు రైతులు, మత్స్యకార సంఘాల నాయకులు ఎన్నిసార్లు రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం వెనుక సదరు బడా భూస్వామి 'పలుకుబడి గల రాజకీయ 'ఒత్తిడితో 'మామూళ్ల' హస్తం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, సర్వే నెంబర్ 249 లోని అంకమ్మ పెద్ద చెరువును సమగ్రంగా సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించాలి. కలుషిత రసాయనాలు వదులుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, ఆయకట్టు రైతులను, మత్స్యకారులను ఆదుకోవాలని ఆయకట్టు రైతులు మరియు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


# చెరువుల సుందరీకరణా. రియల్టర్ల 'సుందర' వనమా?!

## దొంతికుంట' కాలువలు బంద్.. రియల్ ఎస్టేట్‌కు పచ్చజెండా?

## రూ. 5 కోట్ల ప్రజాధనం నీళ్లపాలు.. హద్దులు తేల్చకుండానే పనులు..







అశ్వారావుపేట, మే 26 ప్రభాత సూర్యుడుఅభివృద్ధి అంటే రంగులు పూయడమా? చెరువుల చుట్టూ పార్కులు కట్టి.. పచ్చని పంట పొలాలను ఎండబెట్టడమా? అశ్వారావుపేట పట్టణ పరిధిలోని చారిత్రాత్మక 'దొంతికుంట చెరువు' సాగునీటి ఆయకట్టు విషయంలో అధికారుల తీరు చూస్తుంటే సామాన్యుడికి వచ్చే అనుమానాలు ఇవే! రైతుల పొట్టగొట్టి.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేలు చేసేలా కాలువలను మూసేస్తూ, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అనాలోచితంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు నియోజకవర్గంలో పెను దుమారం రేపుతున్నాయి.ఈ అక్రమాలపై దొంతికుంట ఆయకట్టు రైతులు, అశ్వారావుపేట గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నేరుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కు క్షేత్రస్థాయి వాస్తవాలతో కూడిన వినతిపత్రాన్ని (02/03/26)



సమర్పించారు.హద్దులు తేలలేదు.. అక్రమాలకు 'ఆసరా'!ఇరిగేషన్ రికార్డుల ప్రకారం దొంతికుంట చెరువుకు సంబంధించిన పూర్తి స్థాయి నీటి మట్టం (ఫ్టీూ) మరియు బఫర్ జోన్ హద్దులను అధికారులు ఇంతవరకు క్షేత్రస్థాయిలో సర్వే చేసి తేల్చలేదు. చెరువు పరిధి ఎంతో స్పష్టత లేకుండానే.. కేవలం సుందరీకరణ పేరుతో రూ. 5 కోట్ల భారీ బడ్జెట్‌తో పనులు ప్రారంభించేశారు. హద్దులు నిర్ణయించకపోవడం వెనుక ఉన్న అసలు రహస్యం.. భవిష్యత్తులో చెరువు భూములను, కాలువలను యథేచ్ఛగా ఆక్రమించుకోవడానికి కొందరు బడా బాబులకు అవకాశం కల్పించడమేనని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.**సాగునీరు బంద్.. లేఅవుట్లకు పర్మిషన్లు జరజరా!**ఈ చెరువు కింద దాదాపు 80 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ప్రస్తుతం ఎండాకాలంలో రైతులు ఎంతో ఆశతో వరి పంటలు సాగు చేసుకున్నారు. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలకు నీరివ్వాల్సిన అధికారులు.. రైతులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, భారీ మోటార్ల సహాయంతో చెరువు నీటిని అలుగు ద్వారా బయటకు తోడేస్తున్నారు."రైతులకు సాగునీరు అందించడం ప్రాథమిక బాధ్యత. సాగునీటి కాలువలను (ఝు-ఝుశ్రీం) పూర్తిగా మూసేసి, అక్రమ లేఅవుట్లకు అనుమతులివ్వడం వెనుక అధికారుల హస్తం స్పష్టంగా కనిపిస్తోంది. కాలువలు లేని సుందరీకరణ వల్ల రైతులకు వచ్చే లాభం శూన్యం!" అని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.భూగర్భ జలాలకూ ముప్పే!ఈ దొంతికుంట చెరువు కేవలం పంటలకే కాదు.. అశ్వారావుపేట పట్టణ పరిధిలో భూగర్భ జలాలు పెరగడానికి ప్రధాన వనరు. అలాంటి చెరువును కాపాడాల్సింది పోయి, సాగునీటి వ్యవస్థను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని మేధావులు సైతం మండిపడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టరేట్‌లో అనేకమార్లు అర్జీలు ఇచ్చినా స్థానిక యంత్రాంగంలో చలనం లేకపోవడంతో, రైతులు నేరుగా కలెక్టర్‌ను ఆశ్రయించారు.రైతులు, ప్రజల ప్రధాన డిమాండ్లు ఇవేతక్షణమే సర్వే జరపాలి: రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, ఎఫ్.టీ.ఎల్, బఫర్ జోన్ హద్దులను వెంటనే ప్రకటించాలి.పనులు నిలిపివేయాలి: హద్దులు తేలేవరకు ప్రస్తుత సుందరీకరణ పనులను తక్షణమే స్టాప్ చేయాలి.కాలువల పునరుద్ధరణ: 80 ఎకరాలకు సాగునీరు అందేలా కాలువల నిర్మాణం, పునరుద్ధరణను ప్రస్తుత అభివృద్ధి ప్లాన్‌లో చేర్చాలి.అధికారులపై విచారణ: నిబంధనలకు విరుద్ధంగా చెరువు స్థలాల్లో, కాలువలపై లేఅవుట్లకు పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్వయంగా స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని దొంతికుంట ఆయకట్టు రైతులు, చెన్నూరి. రామకృష్ణ సుబ్బారావు, ఎన్. శ్రీనివాసరావు, పి . మధు తేజ మరియు నూనె. హనుమంతరావు అశ్వారావుపేట గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 14 సంవత్సరాల దాటిన బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది..



దుమ్ముగూడెం మే 26 ప్రభాత సూర్యుడు14 సంవత్సరాలు దాటిన బాలికలు తప్పనిసరిగా హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం వలన భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చునని అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లలకు యుక్త వయసు వచ్చినప్పుడే వివాహాలు చేయాలని భద్రాచలం సర్పంచ్ పూణేం కృష్ణ అన్నారు.మంగళవారం దుమ్ముగూడెం మండల పరిధిలో ప్రాజెక్ట్ పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల సందర్భంగా భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిడిపిఓ జ్యోతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పనిచేయుచున్న అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు చిన్నారులకు రక్తహీనత కలగకుండా న్యూట్రిషన్ ఫుడ్ సక్రమంగా అందించాలని, గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా బాలామృతం అందజేసి పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంగా ఉండేలా గర్భిణీలు పలు జాగ్రత్తలు తీసుకునేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే పోషకాహార ప్రాముఖ్యత గురించి తప్పనిసరిగా గ్రామాలలో తెలియజేయాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకునేలా చూడాలని అన్నారు అనంతరం సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఎక్కువ శాతం బాల్య వివాహాలు చేస్తూ ఉంటారని వాటిని నిరోధించడానికి మా ప్రాజెక్టు తరుపున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21 సంవత్సరాలు నిండితేనే వివాహాలు జరిపించాలని, మైనార్టీ తీరకముందు వివాహాలు జరిపిస్తే వివాహాలు జరిపిన వారికి పెళ్లి చేసిన పురోహితులకు మరియు ఆ గ్రామ పెద్దలకు తల్లిదండ్రులకు ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని, గ్రామంలోని యువజన కార్యకర్తలు గ్రామములో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే తప్పనిసరిగా ఐసిడిఎస్ కార్యాలయమునకు సంప్రదించి తెలియజేయాలని అలా రాని పక్షంలో 1098 నెంబర్కు ఫోన్ ద్వారా తెలియజేస్తే తప్పనిసరిగా వారిపై చర్యలు తీసుకుంటారని అన్నారు. అలాగే గ్రామంలోని యూత్ సంబంధించిన యువకులు మానవ అక్రమ రవాణా జరగకుండా ఎప్పటికప్పుడు నీగా పెడుతూ ఉండాలని అన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన బాలికలు అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీరామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి...

## ఉపాధి కార్మికులను రెండు సార్లు ఫోటోలు తీసే పద్ధతి రద్దు చేయాలి...కారం పుల్లయ్య..




దుమ్ముగూడెం మే 26 ప్రభాత సూర్యుడు కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన వీబీ జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని, ఉపాధి కార్మికులను రెండు సార్లు ఫోటోలు తీసే పద్ధతి రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు, మంగళవారం నాడు వైఎస్ఆర్ భవన్ లో జరిగిన తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం 4వ మండల మహాసభ మర్మం చంద్రయ్య అధ్యక్షతన జరిగింది, ఈ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు,పని ప్రదేశాల్లో మంచినీరు, టెంట్లు,మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు,200రోజుల పని,600 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు,కొలతల పద్ధతి తో ఉపాధి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల చంటి మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు,పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల వేదింపులు, దాడులు ఆపాలని ఆయన డిమాండ్ చేశారు, గ్రామీణ కార్మికులకు, ఉపాధి కార్మికులకు, పోడు సాగుదారులకు అండగా తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం పోరాడుతుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మర్మం కల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

.

# బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి

## ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం



మేడ్చల్ మల్కాజ్గిరి ప్రభాత సూర్యుడు ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సిపీసీఆర్ కమిషన్ సభ్యురాలు చందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సామాజిక సమస్య అని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రజలు అప్రమత్తంగా ఉండి బాల్య వివాహాలను అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాల నిషేధ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత పరిరక్షణకు సమాజం మొత్తం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిజ్ఞలో పాల్గొన్న వారు "బాల్య వివాహాలను ప్రోత్సహించము.. మా పరిసరాల్లో బాల్య వివాహాలు జరగకుండా కృషి చేస్తాము.. బాలల హక్కులను పరిరక్షిస్తూ బాల్య వివాహ రహిత తెలంగాణ నిర్మాణానికి సహకరిస్తాము" అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు రామ్మోహన్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాగేష్‌రావు, ఆల్వాల్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, జిల్లా బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ త్రిమూలాదేవి, సఖి బృందం సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.




# సీనియర్లకే షాకిస్తున్న 'పెద్ది' ప్రొడ్యూసర్ ప్లానింగ్!




కేవలం ప్రెస్ మీట్లలో కూర్చోవడమే కాకుండా, తానే స్వయంగా ముందుండి ప్రాజెక్ట్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లే బాధ్యతను భుజాన వేసుకున్నారు. రామ్ చరణ్, బుచ్చిబాబు సన కాంబోలో వస్తున్న 'పెద్ది' సినిమా మరికొన్ని రోజుల్లో థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమా చుట్టూ జరుగుతున్న హడావుడి చూస్తుంటే ఒక భారీ సినిమాకు ఉండాల్సిన ప్రమోషన్స్ ఏ రేంజ్ లో ఉంటాయో అర్థమవుతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఇండస్ట్రీ జనాలను అత్యంత ఆశ్చర్యపరుస్తున్న ఒక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది నిర్మాత వెంకట సతీష్ కిలారు మాత్రమే. బ్యాకప్ లో మైత్రి ఉన్నప్పటికీ మెయిన్ ప్రొడ్యూసర్ గా మొదటిసారి ఇంత పెద్ద ప్రాజెక్ట్ ను హ్యాండిల్ చేయడం మామూలు విషయం కాదు. దిల్ రాజు సాధారణంగా ఈ రోజుల్లో సీనియర్ నిర్మాతలు సైతం ఒక పాన్ ఇండియా సినిమా తీస్తే కేవలం వెనక ఉండి డబ్బులు పెట్టడానికే పరిమితం అవుతున్నారు. ప్రమోషన్ల కోసం ఫేస్ చూపించడానికి అంతగా ఆసక్తి చూపించడం లేదు. కానీ సతీష్ కిలారు మాత్రం ఆ పాత పద్ధతులకు స్వస్తి పలికారు. సినిమా నిర్మాణంలోనే కాకుండా, ప్రమోషన్స్ లోని ప్రతీ ఈవెంట్ కు స్వయంగా హాజరవుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కేవలం ప్రెస్ మీట్లలో కూర్చోవడమే కాకుండా, తానే స్వయంగా ముందుండి ప్రాజెక్ట్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లే బాధ్యతను భుజాన వేసుకున్నారు. మొన్న ముంబైలో జరిగిన బాలీవుడ్ మీడియా మీట్ లో ఆయన చూపించిన కాన్ఫిడెన్స్ ట్రేడ్ వర్గాలను సైతం ఫిదా చేసింది. అక్కడి హిందీ మీడియా టోన్ కు తగ్గట్టుగా, పెద్ది సినిమా ఏ రేంజ్ లో ఉండబోతోందో ఆయన ఇచ్చిన ఎలివేషన్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. అలాగే భోపాల్ లో ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ కాన్సెర్ట్ కోసం ఆయన చేసిన ఖర్చు, ప్లాన్ చేసిన విధానం చూస్తే సినిమా కోసం ఎంత గట్టిగా ఇన్వెస్ట్ చేస్తున్నారో అర్థమవుతోంది. కేవలం బ్యాక్ సైడ్ డబ్బులు పెట్టడమే కాకుండా, ప్రతీ ఫ్రేమ్ లోనూ ఈవెంట్ లోనూ ఒక ప్యాషన్ ఉన్న నిర్మాతగా ఆయన హైలైట్ అవుతున్నారు. ఇక బెంగళూరులో జరిగిన గ్రాండ్ ఈవెంట్ లో కూడా ఆయన తన జెన్యూన్ మాటలతో కన్నడ ఆడియన్స్ ను ఆకట్టుకున్నారు. ఈ సినిమా అవుట్ పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చెప్తూ, రామ్ చరణ్ ఈ పాత్ర కోసం పడిన కష్టాన్ని హైలెట్ చేశారు. ఒక పవర్ఫుల్ అథ్లెట్ గా కనిపించడం కోసం చరణ్ ఏకంగా మూడు సార్లు మేకోవర్ మార్చారని, షూటింగ్ లో ఎన్నో గాయాలు అయినా లెక్కచేయకుండా ప్రాణం పెట్టి చేశారని సతీష్ కిలారు వెల్లడించారు. కన్నడ లెజెండ్ శివరాజ్ కుమార్ ఈ ప్రాజెక్ట్ లో ఉండటం సినిమాకు ప్లస్ అని ఆయన కొనియాడారు. గొప్ప మ్యూజిక్ డైరెక్టర్ కాగలడు!– మాధవపెద్ది సతీష్ కిలారు చేస్తున్న ఈ హడావుడి కేవలం పెద్ది సినిమా కోసమే కాదు, ఆయన భవిష్యత్తు పాన్ ఇండియా రూట్ కు ఇది ఒక పెద్ద పునాది అని చెప్పవచ్చు. మొదటి సినిమాతోనే దేశవ్యాప్తంగా ఉన్న డిస్ట్రిబ్యూటర్లు, మీడియా వర్గాలతో ఆయనకు ఒక బలమైన నెట్వర్క్ క్రియేట్ అవుతోంది.

# సమంత రూ.100 కోట్ల బ్రాండ్‌గా ఎలా మారింది ? ఇదే అసలు పవర్!



సౌత్ ఇండియాలోనే వన్ ఆఫ్ ది హయ్యెస్ట్ పెయిడ్ హీరోయిన్ అయిన సమంత క్రేజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. సౌత్ ఇండియాలోనే వన్ ఆఫ్ ది హయ్యెస్ట్ పెయిడ్ హీరోయిన్ అయిన సమంత క్రేజ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కేవలం సినిమాలే కాదు.. బిజినెస్ వెంచర్స్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్, స్మార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌తో ఆమె ఏకంగా రూ.100 కోట్లకు పైగా సామ్రాజ్యాన్ని సృష్టించుకుంది. కేవలం ఒక నటిగానే కాకుండా ఒక పవర్‌ఫుల్ బ్రాండ్‌గా ఎదిగిన సామ్ ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. లేటెస్ట్‌గా ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా రిలీజ్‌కు రెడీ అవుతుండటంతో ఆమె లగ్జరీ లైఫ్ స్టైల్, సంపాదన మరోసారి హాట్ టాపిక్‌గా మారాయి. అసలు సీక్రెట్ ఇదే: సమంతకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఒక్కో సినిమాకు దాదాపు రూ.3 నుండి రూ.5 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. ఇక స్పెషల్ సాంగ్స్ కోసం అయితే రూ.5 కోట్ల వరకు ఛార్జ్ చేసింది. దీనికి తోడు పలు బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఉంటూ ఏడాదికి రూ.8 కోట్ల దాకా వెనకేస్తోంది. ఇక ఓటీటీ ప్రాజెక్టులకైతే ఏకంగా రూ.10 కోట్ల వరకు అందుకుంటూ తన రేంజ్ ఏంటో చూపిస్తోంది. కోట్లాది రూపాయల ఇళ్లు.. రియల్ ఎస్టేట్ పవర్: సమంతకు లగ్జరీ ఇళ్లంటే చాలా ఇష్టం. హైదరాబాద్‌లోని ప్రముఖ జూబ్లీహిల్స్ ఏరియాలో రూ.80 కోట్ల విలువైన భారీ ప్యాలెస్ లాంటి ఇల్లు ఆమెకు ఉంది. ఇక ఇది కాకుండా ముంబైలో సముద్రం కనిపించే ఒక అందమైన అపార్ట్‌మెంట్ అది సుమారు రూ.15 కోట్లు, హైదరాబాద్‌లోనే మరో రూ.8 కోట్ల డూప్లెక్స్ హౌస్ కూడా ఉన్నాయి. గ్యారేజీలో మెరిసే క్రేజీ కార్లు: సామ్ కార్ల కలెక్షన్ కూడా చాలా రాయల్‌గా ఉంటుంది. ఆమె గ్యారేజీలో రూ.2.55 కోట్ల విలువైన మెర్సిడెస్ +63ూవీ+ ఉంది. ఇక దాంతో పాటు రూ.2.26 కోట్ల రేంజ్ రోవర్ వోగ్, రూ.1.46 కోట్ల పోర్షే కేమాన్ +ూ, అలాగే రూ.1.40 కోట్ల విలువైన దీవీఔ 7 సిరీస్ లాంటి ఖరీదైన కార్లు ఆమె స్టైల్, పవర్‌కు నిదర్శనంగా నిలుస్తాయి. త్వరలోనే 'మా ఇంటి బంగారం' సందడి: ఇక సినిమాల విషయానికి వస్తే, సమంత లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ హార్ట్ టచింగ్ సినిమాను సామ్ భర్త రాజ్ నిడిమోరు నిర్మించడం విశేషం. ఇక జూన్ 19న ఈ చిత్రం గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతోంది. సమంత కేవలం గ్లామర్ నటి మాత్రమే కాదు, మైండ్ ఉన్న బిజినెస్ ఉమెన్ కూడా. తన టాలెంట్, కష్టం, సరైన ప్లానింగ్‌తో ఇండస్ట్రీలో ఒక తిరుగులేని బ్రాండ్‌గా మారింది.

# ఫైనల్ గా 'దేవర' శాటిలైట్ సస్పెన్స్ కి తెర.. ఆ ఛానెల్ కి హక్కులు!



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ చిత్రమే "దేవర". ఎన్టీఆర్ కి భారీ హిట్ గా నిలిచిన ఈ చిత్రం థియేటర్స్ లో ఓటిటిలో బాగానే రాణించింది కానీ ఇన్నేళ్ల గ్యాప్ లో ఇంకా టీవీ ప్రీమియర్ కి మాత్రం నోచుకోలేదు. పైగా సినిమా శాటిలైట్ హక్కులు ఇంకా టాలీవుడ్ లో పెద్ద సస్పెన్స్ గా మారింది.అయితే ఫైనల్ గా ఈ సస్పెన్స్ కి తెర పడింది. ప్రముఖ టీవీ ఛానెల్ ఈటీవీ వారు దేవర శాటిలైట్ హక్కులు సొంతం చేసుకున్నారు. సో అతి త్వరలోనే దేవర వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ ని ఇందులో ఆశించవచ్చు. ఏదైనా స్పెషల్ పండుగ రోజున ప్లాన్ చేసుకుంటే సినిమాకి మంచి టీఆర్పీ వచ్చే అవకాశం ఉంది. ఇక ఈ చిత్రానికి అనిరుద్ సంగీతం అందించగా యువసుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహించారు. అలాగే పార్ట్ 2 ప్రస్తుతానికి అయ్యితే హోల్డ్ లోనే కొనసాగుతుంది

# రామ్ చరణ్ తో ఒక్క సాంగ్.. జాన్వీ కపూర్ చెప్పిన క్రేజీ వెయిట్ లాస్ సీక్రెట్!



జాన్వీ మాట్లాడుతూ.. ''ఈ సినిమాలో చరణ్ సర్ తో పాటు లీడ్ డ్యాన్సర్లు, చివరకు బ్యాక్ గ్రౌండ్ డ్యాన్సర్లు కూడా మూడు నాలుగు రోజుల షూటింగ్ కే బాగా సన్నబడిపోయారు.బెంగళూరులో జరిగిన 'పెద్ది' సినిమా ఈవెంట్ లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో పాటు హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఈ జూన్ 4న సినిమా థియేటర్లలోకి రాబోతున్న తరుణంలో, కర్ణాటక ప్రమోషన్స్ లో జాన్వీ పంచుకున్న కొన్ని విషయాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తన డ్యాన్స్ ఎక్స్ పీరియన్స్ బెంగళూరు ఫుడ్ గురించి ఆమె మాట్లాడిన తీరు అక్కడి ఆడియన్స్ ను బాగా ఆకట్టుకుంది. ఈవెంట్ లో యాంకర్ జాన్వీ కపూర్ ను ఆమె ఫిట్నెస్ డైట్ సీక్రెట్ గురించి ఒక ప్రశ్న అడిగింది. దానికి జాన్వీ నవ్వుతూ చాలా ఇంట్రెస్టింగ్ సమాధానం ఇచ్చింది. ''నాకు తెలిసిన బెస్ట్ వెయిట్ లాస్ టిప్ ఏంటో తెలుసా.. రామ్ చరణ్ సర్ తో కలిసి ఒక్క పాటలో డ్యాన్స్ చేయండి. కేవలం నాలుగు రోజుల్లోనే మీరంతా చాలా స్లిమ్ గా మారిపోతారు'' అంటూ ఒక క్రేజీ సీక్రెట్ ను బయటపెట్టింది. చరణ్ పక్కన డ్యాన్స్ చేయాలంటే ఎంత ఎనర్జీ ఉండాలో, ఆయన స్పీడ్ అందుకోవడం ఎంత కష్టమో జాన్వీ మాటల్లోనే క్లారిటీ వచ్చేసింది. దిల్ రాజు జాన్వీ మాట్లాడుతూ.. "ఈ సినిమాలో చరణ్ సర్ తో పాటు లీడ్ డ్యాన్సర్లు, చివరకు బ్యాక్ గ్రౌండ్ డ్యాన్సర్లు కూడా మూడు నాలుగు రోజుల షూటింగ్ కే బాగా సన్నబడి పోయారు. అంతటి హై ఎనర్జీ ఉన్న సాంగ్స్ ఈ సినిమాలో ఉన్నాయి" అని వెల్లడించింది. చరణ్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడం తన కెరీర్ లోనే వన్ ఆఫ్ ది బెస్ట్ మూమెంట్ అని, జూన్ 4న థియేటర్లలో ఆ సాంగ్స్ చూసి ఆడియన్స్ కచ్చితంగా ఎంజాయ్ చేస్తారని ఆమె ధీమా వ్యక్తం చేసింది. ఇక బెంగళూరు సిటీతో ఉన్న కనెక్షన్ గురించి చెబుతూ.. తనకు ఇక్కడి ఫుడ్ అంటే చాలా ఇష్టమని చెప్పింది. ''నాకు బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ అంటే పిచ్చి. అక్కడ దొరికే ఫిల్టర్ కాఫీ, గడ్ బడ్ ఐస్ క్రీమ్ నా ఫేవరెట్. కాకపోతే ప్రస్తుతం నేను డైట్ లో ఉన్నాను కాబట్టి వాటిని తినలేకపోతున్నాను'' అంటూ తన బాధను క్యాజువల్ గా పంచుకుంది. ఒక స్టార్ హీరోయిన్ అయి ఉండి కూడా ఎలాంటి బేషజాలు లేకుండా తన మనసులోని మాటను ఓపెన్ గా చెప్పడం అక్కడి వాళ్లకు నచ్చింది. ఈ సినిమాలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ తో కలిసి నటించిన అనుభవాన్ని కూడా జాన్వీ గుర్తుచేసుకుంది. " శివన్నతో నాకు కేవలం ఒక్క చిన్న సీన్ మాత్రమే ఉంది. కానీ ఆ ఒక్క సీన్ లోనే ఆయన కళ్లల్లో ఉన్న నటుడి పవర్ ఏంటో నాకు అర్థమైంది. ఒక గొప్ప యాక్టర్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం, భవిష్యత్తులో ఆయనతో పూర్తి స్థాయి సినిమా చేయాలని కోరుకుంటున్నాను" అని శివన్నపై తనకున్న గౌరవాన్ని చాటుకుంది. ఇక బెంగళూరు ఈవెంట్ లో జాన్వీ కపూర్ తన స్పీచ్ తో అటు కన్నడ ఫ్యాన్స్ ను, ఇటు మెగా అభిమానులను బాగా ఖుషీ చేసింది. ఒక పక్కా విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తున్న పెద్ది సినిమాలో జాన్వీ క్యారెక్టర్ లో ఒక మంచి సిన్సియారిటీ ఉంటుందని ఇప్పటికే టీమ్ గట్టి నమ్మకంతో ఉంది.



Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555